క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 24న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. రామా టాకీస్, రామన్నపేట, బొందివాగు, హంటర్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆంగ్ల భాషా దినోత్సవం

ఖిలా వరంగల్: రంగశాయిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ ప్రేమలత ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆంగ్ల భాషా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆంగ్ల భాష విభాగాధిపతి రమేష్ హాజరై మాట్లాడారు. ప్రాథమిక విద్యాభ్యాసం మాతృభాషలో కొనసాగుతున్నప్పటికీ ఉన్నత చదువులు ఆంగ్లభాషలో కొనసాగించాలన్నారు.కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వర్లు, మూర్తి, శిరీష్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆత్మహత్యలు వద్దు..

హన్మకొండ: జీవితం జీవించడానికే కానీ, ఆత్మహత్యలు చేసుకోవడానికి కాదని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్, సైకాలజిస్టు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. ఇంటర్ ఫలితాలు వెలువడిన క్రమంలో తక్కువ మార్కులు వచ్చాయని, ఉత్తీర్ణత పొందలేదనే బాధతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునే అవకాశముందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు మానసిక స్థైర్యం పెంపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. చదువే జీవితం కాదని, జీవితంలో చదువు ఒక భాగం మాత్రమేనని తెలిపారు.

సివిల్స్ ర్యాంకర్‌కు అభినందన



ఖిలా వరంగల్: ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఫలితాల్లో 11వ ర్యాంకు సాధించిన శివనగర్‌కు చెందిన ఇట్టబోయిన సాయిశివానిని బీజేపీ నేత, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయి శివానికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్, మండలాధ్యక్షులు బోరిగం నాగరాజు, కర్నే రవీందర్, మంద శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు సన్మానం



విద్యారణ్యపురి: వరంగల్ జిల్లా స్థాయిలో ఇంటర్ సెకండియర్ పరీక్షల ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ జూనియర్ విద్యార్థులు, అధ్యాపకులను హనుమకొండలోని వరంగల్ జిల్లా డీఐఈఓ కార్యాలయంలో డీఐఈఓ శ్రీధర్ సుమన్ బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు సంపత్, శరధృతి, సంపత్‌కుమార్, అధ్యాపకులు కొమురారెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు అభినందన



హసన్‌పర్తి: ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. హసన్‌పర్తి వాసవిక్లబ్ ఆధ్వర్యంలో హసన్‌పర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు మాట్లాడారు. కళాశాల అభివృద్ధికి వాసవి క్లబ్ అన్ని విధాలుగా సహకారం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సంద్రు నాగేందర్, కార్యదర్శి పురవర్ధన్, కోశాధికారి నాగమళ్ల మాధవ్, జోన్ చైర్మన్ నాగమళ్ల సుధీర్, డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీలు అప్పని శంకర్, వెలగందుల భీష్మనాథం, ప్రిన్సిపాల్ సునీత తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. ఈమేరకు కలెక్టర్ పి.ప్రావీణ్యకు బుధవారం వినతిపత్రం అందజేశారు. దర్గా కాజీపేట సహకార సంఘం సభ్యుడు కాయిత రాజ్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి స్థానికంగా ధాన్యం కొనుగోలు కేంద్రం లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను రైతులు విన్నవించారు. బీజేపీ 62వ డివిజన్ అధ్యక్షుడు మేకల శ్రావణ్ కుమార్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింగ్ గౌడ్, కాయిత వేణుగోపాల్ యాదవ్, దామెర కుమార్ పాల్గొన్నారు.

మొరం అక్రమ దందా

- మడికొండ శివారులో రాత్రి డంపింగ్
- ఉదయం నగరానికి తరలింపు
- భారీ వాహనాల రాకపోకలతో ధ్వంసమవుతున్న రోడ్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



మడికొండ శివారులో అక్రమంగా డంపు చేసిన మొరం



టిప్పర్‌లో తరలుతున్న మొరం

మడికొండ: కాజీపేట మండలం మడికొండ శివారులో మొరం దందా సాగుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు పక్కన రాత్రి వేళల్లో అక్రమంగా మొరం డంపు చేస్తూ ఉదయం యథేచ్ఛగా నగరంలోకి తరలిస్తున్నారు. నగర పరిధిలోని పలు గ్రామాల్లో ఇలాంటి దృశ్యాలు కనిపిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దృష్టి సారించని అధికారులు

నగర పరిధిలోని మడికొండ, తరాలపల్లి, అమ్మవారిపేట, కుమ్మరిగూడెం, ముప్పారం, నారాయణగిరి తదితర గ్రామాల నుంచి రాత్రి సమయంలో మొరం తరలిస్తూ మడికొండ శివారులో డంపు చేస్తున్నారు. ఉదయం నగరంలోని పలు ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ సిబ్బంది, మైనింగ్ అధికారులు, పోలీసులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో మొరం మాఫియా రెచ్చిపోతోందని ప్రజలు వాపోతున్నారు. మడికొండ శివారులోని ఎలుకుర్తి, కుమ్మరిగూడెం, తరాలపల్లి, కడిపికొండ, శివారు నుంచి రాత్రివేళలో మొరం తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మొరం వ్యాపారులతో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేతులు కలిపి కొత్తగా నిర్మిస్తున్న వెంచర్లలో మొరం పోస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. మామూళ్లకు అలవాటు పడిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు అంటున్నారు. మొరం వ్యాపారులపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మడికొండ శివారు ఎలుకుర్తిలో మొరం కోసం తీసిన భారీ గుంత

భారీ వాహనాలతో రోడ్లు ధ్వంసం

మొరం లోడుతో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లు మొత్తం ధ్వంసం అవుతున్నాయి. ఈక్రమంలో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. రెండు నెలల క్రితం మడికొండ చౌరస్తాలో మొరం టిప్పర్ ఢీకొట్టడంతో ఒక వ్యక్తి కాలు పూర్తిగా విరిగిపోయింది. అధికారులు స్పందించి మొరం తరలిస్తున్న వాహన యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

కేయూ క్యాంపస్: టెక్నాలజీ యుగంలో పుస్తక పఠనం తగ్గిపోతోందని సైకాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తక పఠనం ద్వారానే విజ్ఞానం పెంపొందుతుందని అన్నారు. వరల్డ్ బుక్ అండ్ కాపీ రైట్స్ డే సందర్భంగా కాకతీయ యూనివర్సిటీలోని కేంద్ర గ్రంథాలయంలో ఆయన బుధవారం మాట్లాడారు. పుస్తకాలే నిజమైన మార్గదర్శకులన్నారు. ప్రస్తుత టెక్నాలజీ యుగంలో సెల్‌ఫోన్ వినియోగంపైనే ఎక్కువ సమయం గడుపుతున్నారని, పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. తరగతి గదికి సంబంధించిన పుస్తకాలే కాకుండా వివిధ రంగాలు, అంశాలకు సంబంధించిన పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని పేర్కొన్నారు. వివిధ రంగాల్లో విజేతలుగా నిలిచినవారు మంచి రీడర్లు అని అభిప్రాయపడ్డారు. ఆలోచన సరళి, నిర్ణయాలు తీసుకోవడం, అభివృద్ధి.. పుస్తక పఠనం ద్వారానే సాధ్యమని అన్నారు. సులభంగా పుస్తకపఠనం ఎలా చేయాలి, పోటీ పరీక్షలకు చదివే విధానంపై అవగాహన కల్పించారు. సమావేశంలో కేయూ లైబ్రరీ సైన్స్ విభాగం అధిపతి, లైబ్రరీ మెంబర్ ఇన్‌చార్జ్ డాక్టర్ రాధికారాణి, లైబ్రరీ అసిస్టెంట్ ఇజాక్ ప్రభాకర్, తేజావత్ జువేర్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు టోపీల అందజేత



కాజీపేట అర్బన్: గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ పరిధిలోని మున్సిపల్ కార్మికులకు కార్పొరేటర్ మామిండ్ల రాజు బుధవారం టోపీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర మేయర్, మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు టోపీలు అందజేసినట్లు తెలిపారు. ఎండలో ఉపశమనానికి టోపీలు ధరించాలని, తగు జాగ్రత్తలను తీసుకోవాలని కార్మికులకు సూచించారు.

టీకాలతో పిల్లల్లో వ్యాధులు దూరం



ఇమ్యూనైజేషన్‌ను పరిశీలిస్తున్న అనిల్‌కుమార్

ఎంజీఎం: అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 18 ఏళ్ల వయస్సు వచ్చే వరకు వయస్సుకు తగ్గట్టుగా వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించడం ద్వారా పిల్లలు ఎలాంటి వ్యాధులకు గురికాకుండా ఉంటారని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ మాస్ మీడియా అధికారి ఈదురు అనిల్‌కుమార్ అన్నారు. స్పెషల్ క్యాచ్ అప్ ప్రోగ్రాంలో భాగంగా రామన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న ఇమ్యూనైజేషన్ సెషన్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ వ్యాధి నిరోధక టీకాల పట్టిక ప్రకారం ప్రతీ వ్యాక్సిన్‌ను పిల్లలకు ఇప్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే, వేసవిలో వచ్చే సాధారణ ఆరోగ్య సమస్యలు, హీట్ స్ట్రోక్, నీళ్ల విరేచనాలు, బంక విరోచనాలు, చర్మ వ్యాధులు మొదలగు వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకురాలు నర్మద, ఆరోగ్య కార్యకర్త సులోచన, ఆశ కార్యకర్త సోనీ, అంగన్‌వాడీ కార్యకర్త స్వరూప, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఫ్లెక్సీ చించివేత



నయీంనగర్: ప్రజల్లో బీఆర్‌ఎస్ పార్టీకి వస్తున్న ఆదరణను ఓర్వలేక అసూయతో 54వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ ఫ్లెక్సీలను కాంగ్రెస్ కార్యకర్తలు చించివేసి తొలగించారని బీఆర్‌ఎస్ నాయకులు కందికొండ వేణుగోపాల్, ఛాతిరి భిక్షపతి ఆరోపించారు. ఫ్లెక్సీలు చించినంత మాత్రాన పార్టీకి వస్తున్న ఆదరణ ఆపలేరని అన్నారు. మున్సిపాలిటీ జవాన్లు సక్రమంగా పనిచేయకుండా అధికార పార్టీకి ఊడిగం చేస్తున్నారని వారు పేర్కొన్నారు.

జిమ్ నిర్వాహకులకు అవగాహన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నార్కొటిక్స్ పోలీసులు

హన్మకొండ చౌరస్తా: నార్కొటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య ఆదేశాల మేరకు, ఎస్పీ రూపేష్ పర్యవేక్షణలో వరంగల్ నగరంలోని జిమ్ యాజమానులు, కోచ్‌లకు సింథటిక్ ఇంజక్షన్, స్టెరాయిడ్స్, మాదక ద్రవ్యాల వినియోగంపై నార్కొటిక్స్ పోలీసులు బుధవారం అవగాహన కల్పించారు. ఎవరైనా స్టెరాయిడ్స్ ఉపయోగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిమ్ రికార్డుల నిర్వహణ, గంజాయి, ఇతర డ్రగ్స్ కొనుగోలు, అమ్మకాల రవాణా, వాడకం, స్టెరాయిడ్స్ వాడకం వలన జరిగే కలిగే దుష్పరిణామాలపై వివరించారు. వినియోగదారుల ఫోన్ నంబర్లు, ఆధార్ కార్డులను తప్పనిసరిగా నమోదు చేయాలని, జిమ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డ్రగ్స్ అమ్మకాలు, కొనుగోలు సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 1908, మొబైల్ నంబర్ 87126 71111లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్కొటిక్స్ పీఎస్ డీఎస్పీ సైదులు, ఇన్‌స్పెక్టర్ రవీందర్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి, నార్కొటిక్ పీఎస్ ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి చర్చలకు ఆహ్వానించాలి

ఖిలా వరంగల్: ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపి, శాంతి చర్చలకు ఆహ్వానం పలకాలని తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల సమాఖ్య (ట్యాక్స్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల నాగరాజు కోరారు. ఈమేరకు ఖిలా వరంగల్ పడమర కోట జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద అసంఘటిత కార్మిక నాయకులు బుధవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో గజ్జె చందు, రవన్న, బాబు, రాజేందర్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహన్‌రెడ్డిని కలిసిన అమరేందర్‌రెడ్డి



హసన్‌పర్తి: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి చల్లా అమరేందర్‌రెడ్డి కలిశారు. తాడేపల్లిలోని ఆయన స్వగృహంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

పరిశోధనలో స్టాటిస్టికల్ మెథడ్స్ కీలకం



మాట్లాడుతున్న సదానందం

కేయూ క్యాంపస్: పరిశోధనలో స్టాటిస్టికల్ మెథడ్స్ ప్రధాన భూమిక పోషిస్తాయని కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, కేయూ ఎకనామిక్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సదానందం అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మానవ వనరుల విభాగంలో రీసెర్చ్ మెథడాలజీపై పరిశోధకులకు నిర్వహిస్తున్న పరిశోధనల పద్ధతులు, స్టాటిస్టికల్ మెథడ్స్‌పై ఆయన బుధవారం మాట్లాడారు. వాస్తవికతను ప్రతిబింబించేలా పరిశోధనలు ఉండాలని సూచించారు. సమావేశంలో ఆ విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాస్‌రావు, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాసులు, అధ్యాపకులు చీకటి శ్రీనివాస్, బుర్రి ఉమాశంకర్, ఒడపెల్లి మోహన్, బండి శ్రీనివాస్, పరిశోధకులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వరలక్ష్మి

మామునూరు: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే ఉజ్వల భవిష్యత్‌ను అందిపుచ్చుకోవచ్చని కేయూ ప్రొఫెసర్ డీన్ సీడీసీ పి.వరలక్ష్మి, ప్రొఫెసర్ ఎస్ఎస్‌వీఎస్ శర్మ అన్నారు. ఈమేరకు వరంగల్ బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన ప్రేరణ – 2025 కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యార్థులు వ్యాపారవేత్తలుగా ఎదిగి మరో పదిమందికి ఉపాధి చూపాలన్నారు. అనంతరం జన్‌ఫాక్ట్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ విఘ్నేష్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సుపై విశ్లేషణాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ వాణిదేవి, ఇంద్రసేనారెడ్డి, డాక్టర్ భాస్కర్‌రావు, డాక్టర్ శివశంకర్, ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ గన్‌శ్యామ్ సోలంకి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాష్, ముస్తాక్ హైమద్, శ్రవంతి, తిరుపతిరావు, డాక్టర్ మురళి, సరోజ, సరిత, భార్గవి, దీప్తి, రాధిక, వేణు, ముక్తేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

ఖిలా వరంగల్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వరంగల్ కరీమాబాద్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం వరంగల్ కరీమాబాద్‌కు చెందిన గూడూరు రాజేంద్రప్రసాద్ గుమస్తాగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై అత్తింటి వారు ఇచ్చిన భూమిని ఎలాగైనా విక్రయించాలని తన భార్యపై రాజేంద్ర ప్రసాద్ ఒత్తిడి తెస్తున్నాడు. ఈక్రమంలో ఇటీవల తరుచూ కుటుంబ కలహాలు జరిగాయి. బుధవారం మద్యం తాగి ఇంటికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ వివరించారు.

అక్రమంగా 23 ఆవుల తరలింపు

హసన్‌పర్తి: అక్రమంగా కబేళాలకు తరలిస్తున్న ఆవులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు డీసీఎం వాహనాన్ని సీజ్ చేశారు. హసన్‌పర్తి వంగపహాడ్ వద్ద పోలీసులు బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో భద్రాచలం నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న డీసీఎంను తనిఖీ చేయగా, అందులో 23 ఆవులను గుర్తించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

హన్మకొండ: నిరసన తెలుపుతున్న వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ బాధ్యులు



వరంగల్: శివానందమూర్తికి ప్రార్థిస్తున్న ట్రస్ట్ బాధ్యుడు గోపీచంద్, తదితరులు



పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయం

జమ్మూకశ్మీర్ పహల్గాంలో అమాయక పర్యాటకులపై ఉగ్రమూకలు దాడి హేయమైన చర్య అని పలువురు ఖండించారు. ఈమేరకు నగర వ్యాప్తంగా ముష్కరుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మృతులకు కొవ్వొతులు వెలిగించి నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



హన్మకొండ చౌరస్తా: పాకిస్తాన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



హసన్‌పర్తి: కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



మడికొండ చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



కేయూ క్యాంపస్: కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు



మడికొండలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఛత్రపతి శివాజీ సేన బాధ్యులు

అధికారంలో లేకున్నా ప్రజల్లోనే ఉంటా

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్

హన్మకొండ: అధికారంలో ఉన్నా లేకున్నా తాను ఎల్లప్పుడు ప్రజల్లోనే ఉంటానని, ఇప్పుడూ ఉంటున్నానని ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. 51, 52, 57వ డివిజన్లలో మంగళవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. హనుమకొండ రాంనగర్ కూడలిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదవి అనేది తనకు బాధ్యత అని, ప్రజా సేవ చేసేందుకు ఓ సాధనమని వివరించారు. 30 ఏళ్లుగా ప్రజా జీవితంలోనే ఉంటున్నానని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో సైతం పదవులను లెక్కచేయకుండా రాజీనామా చేశానని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ స్థాపించి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరగనున్న పార్టీ రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి భారీగా ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.



ర్యాలీలో వినయ్‌భాస్కర్, నాయకులు

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



రాంపూర్‌లో గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులు



ప్రొఫెషనల్ వేడుకల్లో విద్యార్థులు, ప్రిన్సిపాల్

మడికొండ: కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవారం నిర్వహించారు. వివిధ తరగతుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాంచంద్రాంరెడ్డి మాట్లాడుతూ వేసవిలో పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లీలారాణి, లక్ష్మి, అరుణ, బ్రహ్మచారి, శంషాద్దీన్, స్వర్ణలత, అటెండర్ రేణుక పాల్గొన్నారు.

ప్రొఫెషనల్ డే వేడుకలు

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని వందన డీజీ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ ఆడెపు శ్యామ్ ఆధ్వర్యంలో ప్రొఫెషనల్ డే వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యేక దుస్తులు ధరించి హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విజయకుమారి పాల్గొన్నారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె



డాక్టరేట్ పట్టాలతో నిరసన తెలుపుతూ..

కేయూ క్యాంపస్: తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీలోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేస్తున్న సమ్మె బుధవారం ఐదో రోజుకు చేరింది. ఈమేరకు కేయూ గేట్ వద్ద మోకాళ్ల మీద నిలబడి చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. తొలుత పరిపాలన భవనం నిర్వహించిన దీక్షకు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీఉల్లాఖాద్రీ సంఘీభావం తెలిపి మాట్లాడారు. పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, ఖమ్మం పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, జేఏసీ బాధ్యులు కరుణాకర్‌రావు, రాజేష్, శ్రీధర్‌కుమార్ లోథ్, సత్య, శ్రీనివాస్, సిద్ధార్థ, సూర్యం, సూర్యనారాయణ, వీణ, శ్రీదేవి, శ్రీలత, కవిత, సరిత, వాణిశ్రీ, శ్రీజ, దీప్తి, ఫాతిమా, బ్లెస్సీ, ప్రియాంక పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల వినూత్న నిరసన

ఉద్యోగ భద్రత కల్పించాలని, జీఓ నంబర్ 21ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పరిపాలన భవన వద్ద అధిక విద్యార్హత గల డాక్టరేట్ పట్టాలను ప్రదర్శిస్తూ పార్ట్‌టైం అధ్యాపకులు బుధవారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేయూ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ గత 15 – 20 ఏళ్లుగా విశ్వవిద్యాలయాల్లో పార్ట్‌టైం లెక్చరర్లుగా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జీఓ 21లో పార్ట్‌టైం అధ్యాపకుల సర్వీస్‌ను పరిగణలోకి తీసుకోకపోవడం శోచనీయమన్నారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ నరేంద్ర నాయక్, బాధ్యులు దేవోజీ నాయక్, మోహన్, తిరుణహరి శేషు, వినోద, భాగ్యమ్మ, నాగేశ్వర్‌రావు, ప్రవీణ్, సంజీవ్, సుజాత, రవీందర్, విజయ, వాణి దేవి, సరిత, జ్యోత్స్న పాల్గొన్నారు.